

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

నగరంలోని హెలీప్యాడ్ గ్రౌండ్ పక్కన గల ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను ఊయలలో ఉంచి అలంకరించగా.. మేయర్ సునీల్ రావు నామకరణం చేశారు. పసుపు దంచి తలంబ్రాలు కలిపి సుగంధ, పూజాద్రవ్యాలను సిద్ధం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, డివిజన్‌వాసులు పాల్గొన్నారు. – కరీంనగర్ కల్చరల్

ఎదుర్కోలు మహోత్సవం

శ్రీరామనవమి పురస్కరించుకొని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి కరీంనగర్‌లోని తన స్వగృహంలో ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేద బ్రహ్మణుల వేదఘోష మధ్య వివిధ పూజాద్రవ్య, ఫలపంచామృత, పుష్ప, ధూపదీప నైవేద్యాలతో శాస్త్రోక్తంగా జరిపించారు. సప్తగిరి కోదండరామాలయం కార్యకర్తలు, రుత్వికులు, భక్తులు భక్తి పాటలతో ఎదుర్కోలు ఘుట్టాన్ని నిర్వహించారు. అనంతరం వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. – కొత్తపల్లి



క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న వహాజొద్దీన్

కరీంనగర్ కార్పొరేషన్: ఎంఐఎం మాజీ చీఫ్, సీనియర్ నేత సయ్యద్ వహాజొద్దీన్ కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి వహాజొద్దీన్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, నడిపెల్లి అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'భారత రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడిద్దాం'

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో భారత రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడిద్దామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ప్రతీ ఒక్కరి కోసం రాజ్యాంగం నిర్మించబడిందని, రాజ్యాంగంలో ఉన్న హక్కులు ప్రతిఒక్కరికీ అవసరమేనని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచారని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ ప్రభుత్వంలో ఉన్న ఎంపీలు, కేంద్ర మంత్రులు కొన్ని చోట్లలో బహిరంగంగా చెబుతున్నారని, భారత రాజ్యాంగం జోలికి వస్తే దేశంలో ఉన్న నిరుపేదలు బీజేపీ పార్టీకి వ్యతిరేకంగా తిరగపడతారని, భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడిన సహించేది లేదని అన్నారు. భారత రాజ్యాంగం 150 కోట్ల ప్రజల ఆస్తి అని పేర్కొన్నారు.

'అవాస్తవాలు ప్రచారం చేస్తే వేటు'

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై అవాస్తవాలు ప్రచారం చేసే యువజన కాంగ్రెస్ శ్రేణులపై వేటు తప్పదని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పార్టీ నాయకత్వం, అంతర్గత విషయాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా, సోషల్ మీడియా ద్వారా అనుచితంగా మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ట్రినిటి విద్యాసంస్థల హర్షం

కరీంనగర్: యూపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో ట్రినిటి పూర్వ విద్యార్థి రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్ ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించడంపై ట్రినిటి కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డిలు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

పనులు ప్రారంభించకుంటే ఆమరణ నిరాహార దీక్ష

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, సుందరగిరి గ్రామాల మధ్య రూ.19 కోట్లతో నిర్మించనున్న తారురోడ్డు పనులను వారం రోజుల్లో ప్రారంభించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని బీజేపీ నాయకుడు, గ్రామ సొసైటీ అధ్యక్షులు మంద శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చిగురుమామిడిలో మాట్లాడారు. డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎంపీ కోటా నుంచి నిధులు మంజూరయ్యాయని, ఉన్న రోడ్డును తొలగించిన కాంట్రాక్టర్ కంకరపోసి వదిలివేశాడని, దీతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. దుమ్ము ధూళితో వాహనదారులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని పట్టుకొని మంగళవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. పట్టణంలో కృష్ణాకాలనీలోని ఓ వ్యక్తి వద్ద రూ.4,300, ఎఫ్‌సీఐ సమీపంలోని ఓ వ్యక్తి వద్ద రూ.1,480, మండలంలోని సైదాబాద్ గ్రామానికి మరో వ్యక్తి వద్ద రూ.2,100 విలువ చేసే మద్యం పట్టుకున్నామని, బెల్టు షాపు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సోదాలు నిర్వహించామన్నారు.



ముస్తాబైన మహాశక్తి ఆలయం



తీగలగుట్టపల్లిలోని రామాలయం

సీతారాముల కల్యాణోత్సవానికి

ఆలయాలు ముస్తాబు

శ్రీరామనవమి పురస్కరించుకొని బుధవారం నిర్వహించనున్న శ్రీసీతారాముల కల్యాణ వేడుకలకు కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయ కమిటీ చైర్మన్లు, ఈవోలు, డివిజన్ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయాలను విద్యుద్దీపాలు, షామియానాలు, పుష్పమాలలు, మామిడి తోరణాలతో అలంకరించారు. భక్తులకు కల్యాణాన్ని తిలకించేందుకు చలువ పందిళ్లు, టెంట్లు వేశారు. నీటి వసతి కల్పించారు. మంగళవారం ఉత్సవ మూర్తులకు అలంకారాలు చేసి ఎదుర్కోలు వేడుక నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కల్యాణాలు వైభవోపేతంగా జరుగనున్నాయి. – కరీంనగర్‌కల్చరల్/కొత్తపల్లి



అంజనాద్రి ఆలయం



సప్తగిరికాలనీలోని కోదండరామాలయం



కొత్తపల్లిలోని రామాలయం



సాయిబాబా ఆలయం



ఎన్నికల గైడ్స్ వచ్చాయ్

సార్వత్రిక ఎన్నికల క్రమంలో ఎన్నికల సంఘం పక్కా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ఎన్నికల సామగ్రి జిల్లాకు చేరగా కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూరు నియోజకవర్గాలకు సరఫరా చేశారు. ఈక్రమంలో వివిధ రకాల గైడ్‌లు మంగళవారం కలెక్టరేట్‌కు చేరాయి. ఓటరు గైడ్, ప్రిసైడింగ్ అధికారి గైడ్, పీవో గైడ్స్, చేయాల్సినవి, చేయకూడనివి వంటి బుక్స్ రాగా ఆయా వర్గాలకు అధికారులు చేర్చనున్నారు. – కరీంనగర్ అర్బన్



అటకెక్కిన యంత్రం.. ప్రజలకెలా జలం?

కలెక్టరేట్‌లో తాగునీటి సౌకర్యం అటకెక్కింది. ఐదేళ్ల క్రితం వరకు కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద తాగునీటి సౌకర్యం కల్పించేవారు. ప్రధాన గేట్ వద్ద ఉద్యోగ సంఘాలు చలివేంద్రం ఏర్పాటు చేస్తుండటంతో సదరు సౌకర్యాన్ని అటకెక్కించారు. దీంతో కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు, ఉద్యోగులు, అధికారులు గేట్ వద్దకు వెళ్లి నీరు తాగాల్సిందే. ఎక్కడికక్కడ నీటి సౌకర్యం కల్పిస్తేనే ప్రయోజనం. – కరీంనగర్ అర్బన్

ఎన్నికల పనుల్లో నిమగ్నం కావాలి

కరీంనగర్‌టౌన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం పార్టీ ఆధ్వర్యంలో నియమించిన ఎన్నికల బాధ్యులందరూ తమ పనుల్లో నిమగ్నం కావాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. మంగళవారం సాయంత్రం బీ జేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో జరిగిన ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించడానికి తగిన కార్యాచరణతో ముందు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేనేజ్‌మెంట్ కమిటీ తగిన కృషి చేయాలన్నారు. ఎన్నికల నిర్వాహణ కోసం ఏర్పాటు చేసిన కమిటీలో ఉన్న ప్రతిఒక్కరూ తమ బాధ్యతలను విధిగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ నిర్వాహణ బాధ్యులు, పార్లమెంటు పరిధి లోని అసెంబ్లీ కన్వీనర్లు, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రవీణ్‌రావు

ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల అందజేత

కరీంనగర్: హైదరాబాద్‌లోని పలు కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న నగరంలోని కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఫుడ్ సైన్స్ విద్యార్థులకు మంగళవారం కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు ఇంటర్న్‌షిప్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా సాకేత్ రామారావు మాట్లాడుతూ ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ డిగ్రీ, పీజీ విద్యార్థులకు యేటా వివిధ కంపెనీలు, ఆస్పత్రుల్లో ఇంటర్న్‌షిప్ కల్పిస్తూ ఉద్యోగాలు అందిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని మోడ్రన్ ఫుడ్స్, బేక్మెట్, తెలంగాణా ఫుడ్స్, తునవ్ ఫుడ్స్, క్రౌన్ బీర్, కరీంనగర్ డెయిరీ, విజయ డెయిరీలతో పాటు పలు కంపెనీల్లో కళాశాలలోని డిగ్రీ విద్యార్థులు 45 రోజులు, పీజీ విద్యార్థులు 90 రోజులు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్‌రావు, విభాగాధిపతి మహేశ్, అధ్యాపకులు అంజలి, ప్రణయ, సంపత్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో సాకేత్ రామారావు

నాడు జలకళ.. నేడు వెలవెల



వర్షాకాలంలో మత్తడి దుంకుతున్న నగునూరు చెక్‌డ్యామ్(ఫైల్)



ఎండిపోయి ఇసుకతో నిండిన గోపాల్‌పూర్ చెక్‌డ్యామ్

- ఎడారిని తలపిస్తున్న చెక్‌డ్యామ్‌లు
- ఇరుకుల్లవాగు ఆయకట్టులో ఎండిన వరిపొలాలు

కరీంనగర్‌రూరల్: ప్రతీ నీటి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ఇరుకుల్ల వాగుపై నాలుగు ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించింది. దీంతో బోర్లు, బావుల్లో నీటిమట్టం పెరగడంతో పాటు పంటలు సమృద్ధిగా పండాయి. గత వర్షాకాలంలో చెక్‌డ్యామ్‌లు నీటితో నిండి రోజుల తరబడి మత్తడి పారాయి. అయితే ప్రస్తుత వేసవికాలంలో చెక్‌డ్యామ్‌ల్లో నీళ్లు నిల్వ లేకపోవడంతో ఎడారిని తలపిస్తున్నాయి.

అడుగంటిన ఆశలు

కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల వాగుపై నగునూరు, గోపాల్‌పూర్, ఇరుకుల్ల, మొగ్ధుంపూర్ గ్రామాల శివారుల్లో మూడేళ్లక్రితం చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆశపడిన రైతాంగానికి వేసవిలో నిరాశే మిగిలింది. వాగు పూర్తిగా ఎండిపోయి ఎడారిలా మారింది. వాగు పరిధిలోని నగునూరు, గోపాల్‌పూర్, వల్లంపహాడ్, ఇరుకుల్ల, దుర్శేడ్, నల్లగుంటపల్లి, మొగ్ధుంపూర్ తదితర గ్రామాల్లో సుమారుగా 2వేల ఎకరాల్లో వరిపంట నీళ్లందక పూర్తిగా ఎండిపోయింది. ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ ఎండిన వరిపొలాలను పరిశీలించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుక తొలగించడంలో నిర్లక్ష్యం

చెక్‌డ్యామ్‌ల్లో పేరుకపోయిన ఇసుకను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు చెక్‌డ్యామ్‌ల్లో ఇసుక నిండిపోయి నీళ్లు నిల్వలేదు. చెక్‌డ్యామ్‌ల్లో పేరుకపోయిన ఇసుకనిల్వలపై ఇరిగేషన్ అధికారులు సర్వే చేశారు. ఇసుకను తొలగించేందుకు రెవెన్యూశాఖ టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుందని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో ఇసుక నిల్వలను తొలగించాలని స్థానిక ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేసినప్పటికీ రెండు శాఖల అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెక్‌డ్యామ్‌ల్లోని ఇసుక నిల్వలను తొలగించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

బుంగను పూడ్చాలి

మానకొండూర్: మానకొండూర్ చెరువు మత్తడికి సమీపంలో బుంగపడటంతో సాగునీరు వృథాగా పోతోందని, బుంగను పూడ్చాలని సీపీఎం మానకొండూర్ జోన్ కార్యదర్శి సుంకరి సంపత్ డిమాండ్ చేశారు. మంగళవారం చెరువుకట్టను పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో బుంగ పడితే ఇప్పటివరకు మరమ్మత్తు చేయలేదని, అలాగే తూము ప్రాంతంలో కాంక్రీటు కింది నుంచి చెరువులోని సాగునీరు వృథాగా వెళ్తుందన్నారు. కోట్ల రూపాయలు చెరువుకట్ట మరమ్మతు కోసం ఖర్చు చేస్తున్నా ఇంకా లోపాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుపై అనేక కులాలు ఆధారపడి బతుకుతున్నాయని వెంటనే చెరువు కట్ట వద్ద ఏర్పడిన బుంగ, నీటి లీకేజీ అరికట్టాలన్నారు. ఆయన వెంట నాయకులు సతీష్, తిరుపతి, శ్రీనివాస్, రాకేష్, రాజు, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



బుంగ పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సంపత్

కూలి పెంచాలని ఆందోళన

శంకరపట్నం: కూలి పెంచాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కావేరి సీడ్స్ ప్లాంట్ ఎదుట హమాలీలు మంగళవారం ఆందోళన చేశారు. మొలంగూర్‌లో సీడ్ ప్లాంట్‌లో ఏడేళ్లుగా పని చేస్తున్నామని, గతంలో బస్తాకు మూడు రూపాయలు చెల్లించారని, మార్చిలో 30 పైసలు అదనంగా పెంచారని, ఇతర ప్రాంతాలలో బస్తాకు రూ.3.90 పైసలు చెల్లిస్తున్నారని, ఇక్కడ రూ.3.30 పైసలు చెల్లిస్తామనడం సరికాదని నిరసన వ్యక్తం చేశారు. బిహార్ కార్మికులకు మద్దతుగా సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, హమాలీల సంఘం మండల అధ్యక్షుడు బాబా, వామపక్ష నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. కార్మికులను విచ్ఛిన్నం చేయడానికి ప్లాంట్‌లోని ఉద్యోగులు ప్రయత్నిస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి సమ్మయ్య ఆరోపించారు. ఇతర ప్రాంతాల్లో చెల్లించిన విధంగానే ఇక్కడ చెల్లించాలని, కూలి రేట్లు పెంచే వరకు పనులు జరగనివ్వమన్నారు. దీంతో కంపెనీకి చెందిన ఉద్యోగులు హమాలీలతో సంప్రదింపులు జరిపారు. కూలిరేట్ల పెంపు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో శాంతించారు. సమస్య పరిష్కారం కా కుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ప్లాంటు ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరీంనగర్‌క్రైం: రోడ్డు పక్కన స్పృహ తప్పి పడిపోగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 14వ తేదీన రాజీవ్‌చౌక్ మార్గంలో ఒక వ్యక్తి స్పృహతప్పి కింద పడిపోయాడు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వచ్చి అతడిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అతను చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 50 ఏళ్ల వరకు ఉంటుందని, అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పోస్టుమార్టం గదిలో ఉంచినట్లు తెలిపారు.

పలువురి బైండోవర్

గన్నేరువరం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గన్నేరువరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది బెల్ట్‌షాపుల నిర్వాహకులను మంగళవారం తహసీల్దార్ భిక్షపతి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మాదాపూర్, ఖాసీంపేట, గునుకులకొండాపూర్ గ్రామాలకు చెందిన మాదుగుల సంతోష్‌రెడ్డి, మాదుగుల బాల్‌రెడ్డి, నాగుల ఆంజనేయులు, మహేశ్, నూనె నర్సింహారెడ్డి, అకెన వైకుంఠం, మల్లేశం, తాళ్లపల్లి శ్రీపాల్, తాళ్లపల్లి అంజయ్య, సుధగోని కిష్టస్వామి, కనపర్తి శ్రీధర్‌లను బైండోవర్ చేశామన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే జైలుశిక్ష, జరిమానా తప్పవని హెచ్చరించారు.

'వింధ్యావాలి'లో శ్రీరామనవమి ఉత్సవాలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని మెహర్‌నగర్‌లో గల వింధ్యావాలీ ఉన్నత పాఠశాలలో మంగళవారం శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన శ్రీరామ కల్యాణోత్సవం నాటకం, వేషధారణలు, ఏకపాత్రాభినయాలు అలరించాయి. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి.ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వివిధ వేషధారణల్లో విద్యార్థులు